నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 సోమవారం 3 జూన్ 2024 MULUGU JAYASHANKAR BHUPALPALLY




భూపాలపల్లిలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా



హనుమకొండ కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఊరూరా ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

# దశాబ్ది వైభవం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవం అంబరాన్నంటింది. ఆదివారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పలు సంస్థల్లో జాతీయ జెండాలు ఎగురవేశారు. అమరవీరులకు నివాళులర్పించారు. ఉద్యమకారులను సన్మానించారు. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్లలో కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్, అద్వైత్‌కుమార్ సింగ్, షేక్ రిజ్వాన్ బాషా, భవేశ్‌మిశ్రా, ఇలా త్రిపాఠి త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, మేయర్ గుండు సుధారాణి, పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.

- నమస్తే నెట్‌వర్క్, జూన్ 2

**జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండా ఆవిష్కరించిన కలెక్టర్లు**

- అమరవీరులకు నివాళి, ఉద్యమ కారులకు సన్మానాలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది



హనుమకొండలోని అమరుల కీర్తి స్తూపం వద్ద తెలంగాణ రచయితల సంఘం సభ్యులు



గొల్లపల్లిలో శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ములుగులో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, మహబూబాబాద్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్, జనగామ, వరంగల్‌లో జెండా వందనం చేస్తున్న కలెక్టర్లు రిజ్వాన్ బాషా, ప్రావీణ్య



వేడుకలకు హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది, నన్నపునేని

# ముగింపు ఉత్సవాల్లో మనోళ్లు..

**అధినేత కేసీఆర్ సమావేశానికి హాజరు ■ తెలంగాణ భవన్‌కు తరలివెళ్లిన ఉమ్మడి జిల్లా నేతలు**

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో ఉద్యమం నాటి చిత్రాలను వీక్షించి నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సమావేశంలో ఎంపీలు మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్, మాజీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.



వినయ్‌భాస్కర్‌తో తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాల్ని నెమరేసుకుంటున్న బీఆర్ఎస్వీ నాయకుడు కంజర్ల మనోజ్‌కుమార్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, సుధీర్‌కుమార్



ఉత్సవాలకు హాజరైన ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

# కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- నియోజకవర్గాల వారీగా టేబుళ్లు
- మూడంచెల భద్రతకు ఏర్పాట్లు
- ఆర్వో ప్రావీణ్య

ఖిలావరంగల్, జూన్ 2: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్వో పీ ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి ఈ నెల 4న ఎనుమాముల మార్కెట్ యార్డులో కౌంటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని 295 పోలింగ్ కేంద్రాలకు 17 టేబుళ్లు, 18 రౌండ్లు, పాలకుర్తి-296 పోలింగ్ కేంద్రాలకు 17 టేబుళ్లు, 18 రౌండ్లు, పరకాల 239 పోలింగ్ కేంద్రాలకు 14 టేబుళ్లు, 18 రౌండ్లు, వరంగల్ పశ్చిమ 244 పోలింగ్ కేంద్రాలకు 14 టేబుళ్లు, 18 రౌండ్లు, వరంగల్ తూర్పు 230 పోలింగ్ కేంద్రాలకు 14 టేబుళ్లు, 17 రౌండ్లు, వర్ధన్నపేట 279 పోలింగ్ కేంద్రాలకు 16 టేబుళ్లు, 18 రౌండ్లు, భూపాలపల్లి 317 పోలింగ్ కేంద్రాలకు 18 టేబుళ్లు, 18 రౌండ్ల ద్వారా కౌంటింగ్ నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈవీఎం కౌంటింగ్‌కు సంబంధించి ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ కలిసి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రౌండ్ ప్రకారం రిజల్ట్‌ను నమోదు చేస్తారని ఆర్వో తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ప్రత్యేక హాల్‌ను ఏర్పాటు చేశామని, హోమ్ ఓటింగ్, విధుల్లో ఉన్న సిబ్బందికి సంబంధించిన ఓట్లను 14 టేబుళ్ల ద్వారా లెక్కిస్తామని పేర్కొన్నారు. ఒక టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, తహసీల్దార్ స్థాయి ఏఆర్వో ఉంటారని తెలిపారు. దీనితోపాటు సర్వీసు ఓటర్లకు సంబంధించి ఈటీపీబీఎస్ పద్ధతిలో స్కానింగ్ ద్వారా కౌంటింగ్ నమోదు చేస్తారని వెల్లడించారు. కౌంటింగ్ సిబ్బందికి రెండుసార్లు శిక్షణ ఇచ్చామన్నారు. ఎన్నికల సంఘం నియమించిన ఇద్దరు అబ్జర్వర్లు బండారి స్వాగత్ రణవీర్‌చంద్, రాజేశ్‌కుమార్ కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తారని పేర్కొన్నారు. పోస్టల్, ఈవీఎం బ్యాలెట్ల కౌంటింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తామని ఆర్వో పేర్కొన్నారు. కౌంటింగ్ కోసం మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. కాగా, జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల కౌంటింగ్ విధుల్లో నిమగ్నమైనందున నేటి ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టరేట్ తెలిపారు.

## విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

**సీపీ అంబర్ కిశోర్ ఝా**



సుబేదారి, జూన్ 2 : ఈ నెల 4న లోక్‌సభ ఓట్ల కౌంటింగ్ సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని సీపీ అంబర్ కిశోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఎనుమాముల మార్కెట్‌లో ఓట్ల లెక్కింపు సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేశామని, ముగ్గురు డీసీపీలు, పది మంది ఏసీపీలు, 29 మంది సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, సిబ్బంది, సాంకేతిక సిబ్బంది విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు రోజున 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఊరేగింపులు, సభలు, ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.



కాజీపేట రైల్వే జంక్షన్ ప్రవేశ ద్వారం వద్ద వర్షపు నీరు

# గాలివాన బీభత్సం

- పలుచోట్ల కూలిన చెట్లు, విరిగిన విద్యుత్ స్తంభాలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యం
- వరంగల్ నగరం అతలాకుతలం

నమస్తే నెట్‌వర్క్, జూన్ 2: ఉమ్మడి జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో భారీ వర్షం పడింది. దీంతో పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. వరంగల్ నగర రోడ్లపై వరద నీరు చేరడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం పీహెచ్‌సీ వద్ద చెట్టు విరిగి 11 కేవీ విద్యుత్ వైర్లపై పడడంతో తెగిపోయాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బొమ్మనగూడెంలో చెట్టు విరిగి కరెంటు తీగలపై పడడంతో విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఎర్రగుంటపల్లి, రాపెల్లికోట తదితర గ్రామాల్లో చెట్లు విరిగి పడ్డాయి. ములుగు జిల్లా ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో ఈదురుగాలులు, ఉరుములతో భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ చేసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు టార్పాలిన్ కప్పుకున్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, కేసముద్రంలో చెట్టు విరిగి పడ్డాయి. ములుగు మండలంలోని మల్లంపల్లి, ములుగు, జంగాలపల్లి, బండారుపల్లి, వెంకటాపూర్ మండలంలోని నర్సాపూర్, వెంకటాపూర్, లక్ష్మీదేవిపేట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడవడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ములుగులో రెండు గంటల పాటు మోస్తరు వర్షం పడింది. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం జలమయమైంది. శాయంపేట మండలంలో భారీ శబ్దాలతో పిడుగుల వాన పడింది. కాజీపేట పట్టణంలోని డీజిల్ కాలనీ చౌరస్తా సమీపంలోని డ్రైనేజీలు పొంగిపొర్లడంతో వర్షం నీరంతా రోడ్లపై నిలిచి ట్రాఫిక్ స్తంభించింది. రోడ్లపై విరిగిపోయిన చెట్లను స్థానికులు తొలగించారు. కాజీపేట రైల్వే జంక్షన్‌లో ప్లాట్‌ఫాం పట్టాలపైకి వర్షపు నీరు వచ్చి చేరింది. మడికొండ చౌరస్తా ప్రధాన రహదారిపై నుంచి ఖండాల దాబా వరకు 8 చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగి కరెంట్ తీగలు సైతం తెగిపడ్డాయి. దీంతో సుమారు మూడు గంటల పాటు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సెంట్రల్ జోన్ డీసీపీ బారీ ఆధ్వర్యంలో కాజీపేట ఏసీపీ తిరుమలరావు, పోలీసులు క్లియర్ చేశారు.



కాజీపేట: ప్లాట్‌ఫాం పట్టాలపైకి చేరిన వర్షపు నీరు



కాటారం: బొమ్మనగూడెం వద్ద విరిగిపడిన చెట్టు, విద్యుత్ స్తంభం



జలమయమైన హనుమకొండ బస్టాండ్ ప్రాంగణం




కేసముద్రంలో ఎగిరిపోయిన ఇంటి కప్పు



ములుగు: కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రాశులపై వర్షపు నీరు



కాటారం పీహెచ్‌సీ వద్ద రోడ్డుపై పడ్డ చెట్టు



మడికొండలో రోడ్డుపై విరిగిపడిన చెట్టు



మడికొండలో చెట్టు విరిగిపడడంతో ఎక్కడికక్కడే నిలిచిపోయిన వాహనాలు